
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

సిద్దిపేట
5
బుధవారం 23 అక్టోబరు 2024


మటన్ భోజనం కోసం క్యూలో నిల్చున్న భక్తులు, రైతులు (ఇన్‌సెట్‌లో మటన్ కర్రీ)

మంగళవారం మటన్ భోజనం


సిద్దిపేట ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సమీపంలోని చింతల్‌చెరువు పక్కన ఉన్న ఎల్లమ్మ ఆలయంలో నిత్యం అన్నదానం చేస్తుంటారు. మంగళవారం మాత్రం మటన్, బగారాను అన్నప్రసాదంగా అందజేస్తారు. ఈ మంగళవారం కూడా ఆలయానికి వచ్చిన భక్తులు, మార్కెట్ పక్కనే ఉండడంతో రైతులు మటన్ భోజనాన్ని స్వీకరించారు. సాధారణ రోజుల్లో దాదాపు 100 మంది, మంగళవారం మాత్రం 300 మంది వరకు వస్తుంటారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. రెండేళ్ల నుంచి మటన్ భోజనం పెడుతున్నట్లు చెప్పారు.

- సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి)

అమ్మలా అక్కున చేర్చుకుంటారు

అప్పుడే పుట్టిన శిశువులను భారంగా భావించినా, వద్దని అనుకున్నా.. ఎక్కడా పారేయకుండా సిద్దిపేటలోని జీజీహెచ్‌లో వదిలిపెట్టేలా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉయ్యాలను ఏర్పాటు చేశారు. అందులో వదిలిన శిశువులను చేరదీసి వారికి అవసరమైన చికిత్స అందిస్తుంటారు. మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు ఏడు నెలల మగశిశువును ఉయ్యాలలో వదిలి వెళ్లారు. పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సురేష్‌బాబు పసికందుకు చికిత్సను అందించారు. శిశువు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా ఉన్నట్లు గుర్తించామని, ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు.

- సిద్దిపేటటౌన్, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి)


శిశువుకు వైద్యమందిస్తున్న డాక్టర్ సురేష్‌బాబు


సిద్దిపేటలోని జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ఉయ్యాల

అనుమతి లేకుండా
నిర్మిస్తే చర్యలు

- సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్


శివాజీనగర్‌లో అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సిద్దిపేట టౌన్, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మున్సిపల్ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ హెచ్చరించారు. ఆయన ఆదేశాల మేరకు మంగళవారం పలు అక్రమ కట్టడాలను టౌన్ ప్లానింగ్ అధికారి దేవరాజు సిబ్బందితో కలిసి కూల్చివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలోని 23 వార్డులో శివాజీనగర్‌లో రోడ్డులో ఆక్రమించి ఐరన్‌మెట్లు, మురుగుకాలువపై నిర్మాణాలను తొలగించినట్లు తెలిపారు. అదనపు ఫ్లోర్ స్లాబ్‌ను పోలీసుల సహకారంతో కూల్చివేసినట్లు చెప్పారు. వీరందరికీ గతంలోనే నోటీసులు జారీ చేశామని, అయినా వారిలో ఎలాంటి మార్పు లేకపోవడంతో చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలో కొత్తగా నిర్మాణాలు చేపట్టాలనుకుంటే ముందుగానే అనుమతులు తీసుకోవాలని ఆయన సూచించారు.


ఏబీవీపీ కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

స్కాలర్‌షిప్‌లు ప్రభుత్వ భిక్షకాదు..
విద్యార్థుల హక్కు

- ఏబీవీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడికి యత్నం
- అడ్డుకున్న పోలీసులు

8

బాబోయ్..కుక్కలు!

తేలని శునకాల లెక్క... ఒక్కరోజులో తేల్చాలన్న అధికారులు

- బర్త్ కంట్రోల్ బాధ్యతలూ జీపీలకే..
- అసలే నిధుల లేమితో సతమతం
- తమ వల్ల కాదంటున్న కార్యదర్శులు

ఏ సందు చూసినా.. ఏ రోడ్డు ఎక్కినా కుక్కలే... గుంపులు.. గుంపులుగా సంచరిస్తూ జనాన్ని భయపెడుతున్నాయి. దాడులు చేస్తూ కాటు వేస్తున్నాయి. చిన్నారులు.. పెద్దలు.. ఆడవాళ్లు ఇలా ఎవరిని పడితే వారిని కరుస్తున్నాయి. గ్రామాల్లో అసలు ఎన్ని కుక్కలు అన్న లెక్కలూ అధికారుల వద్ద సరిగ్గా లేవు. ఇక, వాటి నియంత్రణ బాధ్యతలనూ గ్రామపంచాయతీలకు అప్పగించి చేతులు దులుపుకున్నారు.


దుబ్బాకలో శునకాల స్వైరవిహారం

దుబ్బాక, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శునకాలు స్వైరవిహారం చేస్తున్నాయి. చిన్నారులు, పెద్దలు, వాహనదారులపై దాడులు చేస్తున్నాయి. దీంతో జనం రోడ్డెక్కాలంటేనే భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. పశువులనూ వదలకుండా కరుస్తున్నాయి. ఈ నేపథ్యంలో కుక్కలపై యుద్ధం చేస్తున్నామని చెప్పిన ప్రభుత్వం ఆభారం గ్రామపంచాయితీలపై వేసి చేతులు దులుపుకుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అసలే నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న గ్రామాలపై కుక్కల ఏబీసీ ఆపరేషన్ల భారం కూడా మోపడంతో వాటి నియంత్రణ కష్టసాధ్యం అవుతోంది. అంతే కాకుండా ఆఘమేఘాలపై కుక్కల లెక్క కూడా తేల్చాలని ఆదేశించడంతో మమ అనిపించారే తప్ప.. సరైన గణన జరగలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.


మున్సిపాలిటీల్లో కుక్కలను పట్టుకుంటున్న యానిమల్ వెల్ఫేర్ సొసైటీ సిబ్బంది

హడావిడిగా..

గత నెల 8న స్వచ్ఛదనం- పచ్చదనంలో భాగంగా జిల్లాల్లోని 499 గ్రామపంచాయతీల పరిధిలో కుక్కలు ఎన్ని ఉన్నాయో ఒకేసారి లెక్కించాలని జిల్లా అధికారులు ఆదేశించారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి పది గంటల లోపు కుక్కలు ఎక్కువ సంచరించే అవకాశం ఉంటుందని, ఆ సమయంలో గ్రామ యువకుల సహకారం తీసుకుని కుక్కల లెక్క తేల్చాలని ఆదేశించారు. అందులో ఆడకుక్కలు, మగ కుక్కలతో పటు క్రూర స్వభావం గల కుక్కలను లెక్కించాలని నిర్దేశించారు. దీంతో గ్రామ కార్యదర్శులు, మున్సిపాలిటీల పరిధిలో కుక్కల గణన చేపట్టారు. అందులో క్రూర స్వభావం ఉన్న కుక్కలు మొత్తం 16,552 ఉన్నట్లుగా తేల్చారు. ఇక ఆడ కుక్కలు, మగ కుక్కలు, పిల్లలు ఎన్ని ఉన్నాయన్నది తేలలేదు.

ఏబీసీల భారం..

సిద్దిపేట జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలతో పాటు గ్రామాల్లో కుక్కలకు యానిమల్ బర్త్ కంట్రోల్ ఆపరేషన్ చేపట్టాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో నిధులు లేక కొందరు కార్యదర్శులు అప్పులు చేసి, చిన్న చిన్న పనులు చేపడుతున్నారు. ఈ క్రమంలో కుక్కల కుటుంబ నియంత్రణ.. వారికి తలకు మించిన భారంగా మారింది. జిల్లాలోని ప్రతీ గ్రామంలో సుమారు 75 నుంచి 125 వరకు కుక్కలున్నట్లు అంచనా. ఈ కుక్కలను పట్టుకోవడం, వాటికి వ్యాక్సినేషన్, ఆపరేషన్, ఏబీసీ (యానిమల్ బర్త్ కంట్రోల్) గ్రామపంచాయతీలకు భారంగా మారింది. తాము ఉచితంగా ఆపరేషన్లు, ఏబీసీలు చేసేందుకు సిద్ధమే కానీ, కుక్కల తరలింపు వంటి వాటితో తమకు సంబంధం లేదని పశువైద్యాధికారులు చెబుతున్నారు. మున్సిపాలిటీల పరిధిలో ఒక కుక్కను పట్టుకుని, దానిని తరలించి, ఆపరేషన్ తర్వాత ఆరు రోజులు పాటు సంరక్షించేందుకు, తర్వాత వాటిని ఆయా ప్రాంతాల్లో వదిలేందుకు స్వచ్ఛంద సంస్థలకు రూ. 1,800చొప్పున చెల్లిస్తున్నారు. అయితే, ఈ ఖర్చు గ్రామ పంచాయతీలు భరించే స్థితిలో లేవని ఓ గ్రామ కార్యదర్శి చెప్పారు. ఇందుకోసం జిల్లాలో కొన్ని చోట్ల ఎన్‌జీవోల సహకారం తీసుకుంటున్నా.. నిధులు అవసరమనే అంటున్నారు.

మున్సిపాలిటీల్లో ఆపరేషన్ షురూ..

జిల్లాలోని దుబ్బాక, సిద్దిపేట, గజ్వేల్, చేర్యాల, హుస్నాబాద్ మున్సిపాలిటీలో కుక్కలకు

మిగతా 8వ పేజీలో...



రైతు కష్టం..
చెరువు పాలు

- మరిన్ని ఫొటోలు 7లో..

న్యాయం చేస్తారా..
చనిపోమంటారా?

- బతికి ఉండగానే మరణించాడని పట్టా మార్పు
- పురుగులమందు డబ్బాతో బాధిత రైతు ఆందోళన

7



సిరులు కురిపిస్తున్న
వంకాయ

- సాగుతో అధిక లాభాలు
- సంవత్సరంలో ఎనిమిది సార్లు దిగుబడి
- కిలో రూ.60 నుంచి రూ.70 చొప్పున విక్రయం

8


పోలీస్ కమిషనర్ కార్యాలయ ఆవరణ విద్యార్థులకు ఏకే 47 తుపాకుల గురించి అవగాహన కల్పిస్తున్న సీపీ అనురాధ

అబ్బురం.. ఆయుధం

సిద్దిపేట క్రైం, అక్టోబరు 22 : పోలీసు అమరవీరుల సంస్మరణ దినం (ఫ్లాగ్ డే) కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం పోలీస్ కమిషనర్ కార్యాలయ ఆవరణంలో సీపీ అనురాధ ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సిద్దిపేట, సిద్దిపేట రూరల్ పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు దాదాపు 1700 మంది ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ అనురాధ విద్యార్థులకు ఆయుధాలు, వాటి పనితీరు, చట్టాలు సీసీ కెమెరాల ఉపయోగాలు, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. అలాగే పోలీస్ అమరవీరుల త్యాగాలను విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. అనంతరం నూతన టెక్నాలజీతో వచ్చిన స్పీడ్‌లేజర్ గన్‌ను కమిషనర్ కార్యాలయంలో సీపీ అనురాధ పరిశీలించారు. వాటి పనితీరు, బ్యాటరీ తదితర అంశాలను ఆపరేటర్ ట్రాఫిక్ కానిస్టేబుల్ జగదీశ్వర్‌ను అడిగి తెలుసుకున్నారు.

ప్రారంభానికి సిద్ధం

- హుస్నాబాద్‌లో అభివృద్ధి పనులు పూర్తి
- వచ్చేనెలలో సీఎం రేవంత్‌రెడ్డితో ప్రారంభించేందుకు సన్నాహాలు

హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్‌లో ఏళ్ల తరబడిగా సాగుతున్న అభివృద్ధి పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. నవంబరు మొదటివారంలో సీఎం రేవంత్‌రెడ్డితో వీటిని ప్రారంభించేందుకు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రభాకర్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రాంత ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న మున్సిపల్ కార్యాలయ భవనం, రైతుబజార్, మాతా శిశు ఆరోగ్య కేంద్రం, ఏసీపీ కార్యాలయాలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయ నూతన భవనాన్ని రూ.5కోట్లతో నిర్మించారు. లిఫ్ట్ పనులు మినహా అన్ని పూర్తయ్యాయి. హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈభవనాన్ని నిర్మించారు. రూ.2.50కోట్లతో పనులు చేపట్టగా గ్రౌండ్, ఫస్ట్, సెకండ్ ఫ్లోర్‌లలో అధునాతనంగా నిర్మిస్తుండటంతో వ్యయం రూ.5కోట్లకు చేరింది.

రూ.2.53 కోట్లతో రైతుబజార్

పట్టణంలోని చావడి వద్ద రూ.2.53 కోట్లతో రైతుబజార్ నిర్మించారు. పలు సమస్యలతో ఆరేళ్లుగా ఈ పనులకు మోక్షం లభించలేదు. దీనికి మార్కెట్‌శాఖ నుంచి నిధులు కేటాయించారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో రైతు బజార్, ఫస్ట్ ఫ్లోర్‌లో ఫంక్షన్ హాల్, సెకండ్ ఫ్లోర్‌లో కిచెన్, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్ నిర్మాణం చేపట్టారు.


హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయ భవనం

మాతా శిశు ఆరోగ్య కేంద్రం..

రూ. 7.50 కోట్లతో హుస్నాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్మిస్తున్న 50 పడకల మాతా శిశు ఆరోగ్య కేంద్ర భవనం ప్రారంభానికి సిద్ధమైంది. అలాగే మండల పరిషత్ కార్యాలయ భవనం పక్కన నిర్మిస్తున్న ఏసీపీ భవనం దాదాపుగా పూర్తయింది. దీనిని రూ. 2.84 కోట్లతో నిర్మాణం చేపట్టారు. వీటితో పాటు మరికొన్నింటిని సీఎంతో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

మద్దతు దక్కేనా..

- అకాల వర్షాలతో మక్కలకు తీవ్ర నష్టం
- కొనుగోలు కేంద్రాలు లేక ఇబ్బందులు
- దళారులను ఆశ్రయించి నష్టపోతున్న రైతులు

తొగుట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర రాక రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు అకాల వర్షాలతో చేతికొచ్చిన పంట తడవడంతో మక్కలను ఆరబెట్టడానికి పడారాని పాట్లు పడుతున్నారు.

పంటను విక్రయించుకోవడానికి ప్రభుత్వం సిద్దిపేట మార్కెట్ యార్డులోనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసింది. అలాగే ప్రతి మండల కేంద్రంలోనూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తేనే రైతులకు దూరాభారం తప్పి పంటను అమ్ముకోవడానికి వీలుంటుంది. కానీ ప్రభుత్వం, అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. దీంతో రైతులు పంటను విక్రయించడానికి దళారులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం మొక్కజొన్న పంటకు క్వింటాకు రూ.2,225గా నిర్ణయించింది. దళారులు మాత్రం 2వేల నుండి 2,100 చెల్లించి రైతుల నుంచి పంటను కొనుగోలు చేస్తున్నారు. స్థానికంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు కూడా రవాణా ఖర్చులు, వర్షాలకు భయపడి, దళారులు చెప్పిన రేటుకు అమ్ముకుంటున్నారు. ఫలితంగా క్వింటాల్‌కు రూ.100 నుంచి రూ.200 వరకు నష్టపోతున్నారు.

సిద్దిపేట జిల్లాలో ఈ ఖరీఫ్‌లో 22,220 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంటను సాగుచేశారు. దుబ్బాక నియోజకవర్గం తొగుట మండలంలోని ఎల్లారెడ్డిపేట, గుడికందుల, కాన్గల్, ఘనపూర్, గోవర్ధనగిరి, వర్ధరాజ్‌పల్లి, తుక్కాపూర్, పెద్దమాసాన్‌పల్లి, బండారుపల్లి, లింగంపేట, వెంకట్రావ్‌పేట తదితర గ్రామాల్లో 3,349 ఎకరాల్లో జిల్లాలోనే ఎక్కువ విస్తీర్ణంలో మొక్కజొన్న పంటను సాగుచేశారు. అదే విధంగా మిరుదొడ్డి మండలంలో 1,893 ఎకరాలు, రాయపోల్‌లో 1,025 ఎకరాలు, దౌల్తాబాద్‌లో 1,354 ఎకరాలు, దుబ్బాకలో684 ఎకరాలు, అక్బర్‌పేట- భూంపల్లి మండలంలో 631 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేయడం గమనార్హం. స్థానికంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే తమకు నష్టాలు తప్పుతాయని రైతులు వాపోతున్నారు.


తొగుట మండలం ఎల్లారెడ్డిపేటలో దళారులకు మొక్కజొన్నలను విక్రయిస్తున్న దృశ్యం


కాన్గల్ శివారులో రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్నలు

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

- చిక్కుడు చంద్రం, బీజేపీ మండల అధ్యక్షుడు (తుక్కాపూర్)



ప్రభుత్వ కొనుగోలు కేంద్రం లేక నష్టపోతున్నాం. తక్కువ ధరకే వ్యాపారులకు పంటను అమ్ముకోవాల్సి వస్తుంది. తొగుట వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాన్ని తక్షణమే ఏర్పాటు చేసి రైతుల నుంచి మక్కలను కొనుగోలు చేయాలి.

మొక్కజొన్నకు బోనస్ ప్రకటించాలి

- శ్రీకాంత్‌రెడ్డి, రైతు (గుడికందుల)



అకాల వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రభుత్వం మొక్కజొన్న పంటకు మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లించి న్యాయం చేయాలి. వర్షాలకు నానిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

యువకుడు ఆత్మహత్యాయత్నం

నంగునూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాల్లోకి వెళ్తే. నంగునూరు మండలం సిద్దన్నపేట గ్రామానికి చెందిన ఖానాపురం సాయి కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై మంగళవారం బద్దిపడగ గ్రామ శివారులోని చెట్లపొదల్లోకి వెళ్లి గడ్డి మందు తాగుతూ తాను చనిపోతున్నానంటూ తన స్నేహితులకు వాట్సప్‌లో పోస్ట్ చేశాడు. దీంతో స్నేహితులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వారు అతని ఫోన్ కాల్‌ను ట్రేస్ చేసి గుర్తించారు. అపస్మారక స్థితిలో ఉన్న సాయిని 108 అంబులెన్స్‌లో మొదట సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

GRAND RELEASE TOMORROW FROM 5 pm ONWARDS



3డి తెలుగు వర్షన్

2డి తెలుగు వర్షన్

గోకుల్ 70ఎంఎం - ఎర్రగడ్డ 6.15,9.30

విజేత 70ఎంఎం - బోరబండ 11.00,2.00,6.00,9.00

3డి హిందీ వర్షన్

రామకృష్ణ 35ఎంఎం ఎ/సి - అబిడ్స్ 6.00,9.15

సుధ - శాలిబండ 6.00,7.00,8.30,9.30,10.00

3డి ఇంగ్లీష్ వర్షన్

శ్రీసాయిరాం 70 ఎ/సి - మల్కాజ్‌గిరి 6.30,9.45

2డి ఇంగ్లీష్ వర్షన్

ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి 8.00,10.30

SONY PICTURES RELEASE THRU NVR CINEMA 9966963111

రేపే బ్రహ్మాండమైన విడుదల



మలయాళం వర్షన్

ఈనెల 25న బ్రహ్మాండమైన విడుదల



NTR CINEMAS RELEASE

విజయవంతమైన 2వ వారం



శాంతి 70 ఎంఎం - నారాయణగూడ 11.00,2.00,6.00,9.00

మెగా 70ఎంఎం - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00

ఈనెల 25న బ్రహ్మాండమైన విడుదల



సప్తగిరి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్

ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

మల్లికార్జున 70ఎంఎం - కూకట్‌పల్లి

మెగా 70ఎంఎం ఎ/సి - దిల్‌సుఖ్‌నగర్

లక్ష్మీకళ సినీప్లెడ్ - మూసాపేట్ అంజలి ఎ/సి - సికింద్రాబాద్

NTR CINEMAS

ఈనెల 25న బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 35ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్

Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

GLOBAL CINEMAS RELEASE

ఈనెల 25న బ్రహ్మాండమైన విడుదల



శాంతి 70ఎంఎం - నారాయణగూడ

మహాలక్ష్మీ కాంప్లెక్స్ - కొత్తపేట మెట్రో 70 - బహదూర్‌పురా

లక్ష్మీకళ సినీప్లెడ్ ఎ/సి - మూసాపేట్

MG MOVIES 9989522999

విజయవంతమైన 4వ వారం



సుదర్శన్ 35ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్

Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

11.00,2.30,6.15,9.45

BLOCKBUSTER ENTERTAINER





సంధ్య 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.15,2.15,6.15,9.15

Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

GLOBAL CINEMAS RELEASE

రెబల్ స్టార్ ప్రభాస్ జన్మదిన కానుకగా నేడే చూడండి



దేవి 70 - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 11.15,2.45,6.00,9.30

ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

యూసుఫ్‌బాబా - యూసుఫ్‌గూడ 12.30,3.30,6.45,9.45



గంజాయి మొక్కలను చూపిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఇంటి పెరట్లో గంజాయి సాగు

అల్లాదుర్గం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : అల్లాదుర్గం మండలంలోని ముస్లాపూర్ గ్రామంలోని ఓ ఇంటి పెరట్లో గంజాయి సాగు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదైంది. మెదక్ ఎక్సైజ్ సీఐ సీహెచ్ నాగేశ్వరరావు కథనం ప్రకారం గ్రామానికి చెందిన క్యాసారం అంజయ్య తన ఇంటి వెనక భాగంలోని పేరట్లో గంజాయి సాగు చేస్తున్నారు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి మూడు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు ఈ దాడిలో ఎస్‌ఐ మాన్‌సింగ్, సిబ్బంది సిద్ధయ్య, సర్దార్ అలీ, రవి, వెంకటేశ్, నరేశ్ పాల్గొన్నారు.

వ్యక్తి కాళ్లు, చేతులు కట్టేసి చోరీ

● ఐదు తులాల బంగారం, రూ.20 వేలు తస్కరణ

వట్‌పల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో నిద్రిస్తున్న ఇంటి యజమాని కాళ్లు చేతులు కట్టివేసి దోపిడికి పాల్పడిన సంఘటన సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం పల్వట్ల గ్రామంలో సోమవారం నాటి రాత్రి జరిగింది. స్థానిక పోలీసులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పల్వట్ల గ్రామానికి చెందిన సునందమ్మ తన నివాసంలో ఒక్కరే నిద్రిస్తున్న క్రమంలో ముగ్గురు గుర్తు తెలియని దుండగలు ఇంట్లోకి చొరబడి సునందమ్మ,కాళ్లు చేతులు కట్టివేశారన్నారు. అనంతరం ఇంట్లో బీరువాలో ఉన్న 20 తులాల బంగారు ఆభరణాలు, రూ.20 వేల నగదును అపహరించుకుపోయినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన పై జోగిపేట సీఐ అనీల్‌కుమార్ మంగళవారం సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

కరెంట్ షాక్‌తో గురుకుల విద్యార్థులకు గాయాలు

హవేళిఘణపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): క్రీడా పోటీల కోసం జెండాలు పాతుతున్న విద్యార్థినులకు కరెంట్ షాక్ తగిలి గాయాలైన ఘటన మెదక్ జిల్లా హవేళిఘనపూర్ మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం జరిగింది. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో బుధవారం నుంచి వారం రోజుల పాటు జిల్లాస్థాయి క్రీడా పోటీలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా పాఠశాల గేటు వద్ద విద్యార్థినుల రజిత, గాయత్రి, తనుష్క, వసంతతో పాటు పక్కనే ఉన్న బాలుర గురుకుల పాఠశాలకు చెందిన దీక్షిత్ జెండాలు పాతుతున్నారు. జెండా పైపు విద్యుత్ వైర్లకు తగలడంతో షాక్‌కు గురై నలుగురు విద్యార్థినులు గాయపడ్డారు. వెంటనే వారిని మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ సింధురేణుక. మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి విద్యార్థులను పరామర్శించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



బుజ్జిబాయి(ఫైల్)

కౌడిపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో గిరిజన మహిళ మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని జాజితండాలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తండా సమీపంలో విశ్రాంత ఆర్మీ అధికారికి ప్రభుత్వం ఇచ్చిన ఐదు ఎకరాల భూమి ఉన్నది. ఈ భూమిని శోభ అనే మహిళ కబ్జా చేసి వరి పంట సాగు చేసి రక్షణ నిమిత్తం విద్యుత్ కంచెను ఏర్పాటు చేసింది. మంగళవారం పగలు అయినా విద్యుత్ సరఫరా నిలిపివేయలేదు. తండాకు చెందిన కాట్రోత్ బుజ్జి (38) మేకలను అటు మేతకు తీసుకెళ్లగా విద్యుదాఘాతంతో మేకలు మృతి చెందాయి. వాటిని తీసుకువచ్చేందుకు వెళ్లిన బుజ్జి కూడా షాక్‌కు గురై మృతి చెందింది. విషయం తెలుసుకున్న శోభ కుటుంబసభ్యులు ఇంటికి తాళం వేసి పారిపోయారు. శోభ కుటుంబ సభ్యులు వచ్చే వరకు మృతదేహాన్ని తీసేదిలేదని మృతురాలి కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని నచ్చజెప్పి మృతదేహాన్ని నర్సాపూర్ ఏరియా అసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంజిత్ రెడ్డి తెలిపారు.

ఫ్యూజులు వేస్తుండగా హెల్పర్..



నవీన్ యాదవ్(ఫైల్)

ఝరాసంగం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతానికి గురై హెల్పర్ మృతి చెందిన సంఘటన ఝరాసంగం మండలంలోని చిల్కేపల్లిలో మంగళవారం సాయంత్రం జరిగింది. సంబంధిత అధికారులు, గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామంలో సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో మరమ్మతులు చేయించి బిగించారు. దీంతో ఫ్యూజులు వేయడానికి విధ/విద్యుత్ శాఖలో హెల్పర్‌గా పనిచేస్తున్న నవీన్‌కుమార్(35) మంగళవారం సాయంత్రం త్రీ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కాడు. అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా కావడంతో అతడు షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న సంబంధిత విద్యుత్ అధికారులు అక్కడికి చేరుకరి విచారణ జరిపారు. అనంతరం మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విద్యుత్ కంచె తగిలి యువరైతు..

వట్‌పల్లి, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి) విద్యుదాఘాతంతో యువ రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పోతులకుబోడ గ్రామంలో చోటుచేసుకుంది గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మర్రి చెట్టు కాడి శివ శంకర్(30) తన సొంత పొలానికి పందుల బెడద నివారణ కోసం విద్యుత్ కంచెను ఏర్పాటు చేశాడు. మంగళవారం పొలం వద్దకు వెళ్లిన అతడు ప్రమాదవశాస్తు విద్యుత్ కంచెకు తగలడంతో షాక్‌కు గురై మృతి చెందారు

ఒకేసారి పెట్టుబడి.. శాశ్వత దిగుబడి

- పెర్మాకల్చర్ పద్ధతిలో సాగు
- 9 ఎకరాల్లో పలు రకాల పండ్ల తోటలు, తృణధాన్యాలు, కూరగాయల పంటలు..
- రెండు దశాబ్దాలుగా సాగు

అక్కడ అడుగు పెడితే చాలు.. ఎటూ చూసిన పెద్ద పెద్ద చెట్లు, పచ్చని తోటలు దర్శనమిస్తాయి. వివిధ రకాలు పండ్ల చెట్లు, కూరగాయలు తోటలు, తృణధాన్యాల పంటలతో అచ్చొక మినీ అడవినే తలపిస్తది. ఒక్కసారి పెట్టుబడితో మొక్కలు పెట్టగా.. శాశ్వత దిగుబడి లభిస్తున్నది. ఇంతటి ప్రాధాన్యమున్న ఆ సాగు చేసున్నదని ఎక్కడో కాదు సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల పరిధిలో గల బిడెకన్నె గ్రామం శివారులోని దట్టమైన చెట్ల మధ్యన ఉన్న అరణ్య పెర్మాకల్చర్‌లో.

-ఝరాసంగం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి)

అందులోకి వెళ్లగానే ఆ ప్రకృతి రమణీయతకు మరికాసేపు అక్కడే సేదా తీరితే బాగుటుందని అనిపించక మానదు. సాయంత్రం సూర్యుడు అస్తమించే సమయంలో పక్షులు, పిచ్చుకల కిలకిల రావాలతో ఆ ప్రాంతం కంటికి ఇంపుగా.. చెవికి వినసొంపుగా అనిపిస్తుంది. రెండు ఎకరాల్లో సేంద్రియ ఎరువులను ఉపయోగించి గత కొన్ని సంవత్సరాల నుంచి పెసర, మినుము, సజ్జ, కొర్ర, రాగులతో పాటు అల్లం, పసుపు వంటి వాణిజ్య పంటలనూ సాగు చేస్తున్నారు. వీటి మధ్యలో టమాటా, వంకాయ, బీరకాయ, సోరకాయ తదితర కాయగూరల తోటలను సాగు చేస్తున్నారు. చెట్ల ఆకులతో మల్చింగ్ పద్ధతిలో ఎరువులను తయారు చేసి పంటలకు వాడుతున్నారు. ఇక్కడ సంవత్సరం పొడవునా పలు రకాల పండ్లు లభిస్తాయి.



సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన పండ్ల పంటలు

ప్రకృతి సహిత సాగు..

పర్మనెంట్ అగ్రికల్చర్ పదాల నుంచి వచ్చిన పదమే పెర్మాకల్చర్. దీన్నే శాశ్వత సాగు పద్ధతి అని కూడా పిలుస్తారు. ఇంకా అర్థమయ్యేలా చెప్పాలంటే ప్రకృతి సహిత వ్యవసాయం. పాడి పంటలు అని పేరుకే అంటున్నాం.. కానీ ఇప్పటి రైతులు చాలమంది పాడికి దూరమయ్యారు. విత్తనాలు, మందుల కోసం ఇతరులపై ఆధారపడుతూ ప్రకృతి వైవిధ్యం కోల్పోడానికి కారకులుగా మారుతున్నారు. ఫలితంగా రైతులు పెద్ద ఎత్తున నష్టాలను చవిచూడాల్సి వస్తున్నది. దీనికి పూర్తి విరుద్ధంగా ప్రారంభమైన ఉద్యమమే పెర్మాకల్చర్.

బీడు భూమి సాగులోకి..

రెండు దశాబ్దాల క్రితం ఈ భూమి బీడుగా ఉండేది. ఆ భూమిని పెర్మా పద్ధతి వ్యవసాయానికి ఎంచుకుని.. అంచలంచెలుగా సాగులోకి తెచ్చి సారవంతంగా మార్చారు. కొప్పుల నర్సన్న 1989లో ఆస్ట్రేలియా వెళ్లి అక్కడ పెర్మాకల్చర్‌ని అభ్యసించారు. ఈ ప్రాంతంలోని రైతులను ఆ విధానం వైపు తీసుకెళ్లాలన్నదే ఆయన లక్ష్యం. అందులో భాగంగానే ఝరాసంగం మండలంలోని బిడెకన్నె శివారులో 1999లో 11.20 ఎకరాల పెర్మాకల్చర్ విధానంలో వ్యవసాయం చేయడం మొదలు పెట్టారు. అదే ప్రస్తుతం సేంద్రియ అరణ్యగా మారింది. ఆ అనుభావాలే వేల మందికి పాఠాలయ్యాయి. 2014 నుంచి పెర్మాకల్చర్ వ్యవసాయంపై శిక్షణ తరగతులను ప్రారంభించారు. కరోనా కంటే ముందు విదేశాల నుంచి విద్యార్థినులు, విద్యార్థులు వచ్చి ఈ వ్యవసాయంపై శిక్షణ తీసుకున్నారు. ప్రస్తుతం కూడా తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి విద్యార్థులు వచ్చి 15-20 రోజులు ఇక్కడ శిక్షణ తీసుకుంటున్నారు.



పెర్మా కల్చర్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం..

జహీరాబాద్ ప్రాంతంలోని ఎర్ర నేల భూముల్లో ఎన్నో రకాల పంటలను సాగు చేయవచ్చు. ప్రస్తుతానికి సజ్జ, కొర్ర, రాగులు, పెసర, మినుము పంటలను సాగు చేస్తున్నాం. ఈ వ్యవసాయం గత 20 సంవత్సరాల నుంచి చేపడుతున్నాం. పెర్మాకల్చర్ పై ఈ ప్రాంతంలోని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం మార్కెట్‌లో రసాయనిక ఎరువులు వాడిన పండించిన పంటల నుంచి వచిచన ఆహార పదార్థాలను కొనుగోలు చేసి అనారోగ్యాల బారిన పడుతున్నాం. భూమిపై ఉండే ప్రతీ జీవి బతకాలన్నదే మా లక్ష్యం.

-కొప్పుల పద్మ, అరణ్య సీఈవో



అరణ్యలో పండించిన అల్లనేరెడు, మామిడి పండ్లు

3డీ రీకన్‌స్ట్రక్షన్‌తో కృత్రిమ పుర్రె

● 'హోప్ న్యూరో'లో అరుదైన శస్త్ర చికిత్స

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డిపల్లి చౌరస్తా సమీపంలోని హోప్ న్యూరో అండ్ కార్డియాక్ ఆస్పత్రి డాక్టర్లు తొలిసారిగా అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. కొండాపూర్ మండలం మల్లేపల్లికి చెందిన మహేందర్‌రెడ్డి(45) గత జూలై 2 వ తేదీన తలకు గాయం కావడంతో తలనొప్పి, వింత ప్రవర్తనతో హోప్ ఆస్పత్రికి వచ్చారు. మహేందర్‌రెడ్డిని పరీక్షించిన డాక్టర్లు సీటీ స్కాన్ చేయగా తలకి ఎడమ వైపు మెదడు భాగంలో రక్తం గడ్డ ఉందని నిర్ధారించి ఆపరేషన్ ద్వారా రక్తం గడ్డను తొలగించారు. అయితే మరుసటి రోజే మళ్లీ రక్తస్రావం కావడంతో అతడికి మళ్లీ ఆపరేషన్ ద్వారా రక్తం గడ్డను తొలగించారు. ఆ సమయంలో మెదడుకి ఎక్కువగా వాపు రావడంతో మెదడుపై ఒత్తిడిని నివారించే క్రమంలో కొంత పుర్రె భాగాన్ని తొలగించాల్సిన అవసరం ఏర్పడింది. తదనంతరం ఐదు రోజుల్లో పేషెంట్ పూర్తిగా కోలుకోవడంతో డిశ్చార్జి చేసి ఇంటికి పంపించారు. తాజాగా ఈ నెల 15 వ తేదీన మెదడు వాపు పూర్తిగా తగ్గిన తర్వాత మళ్లీ సీటీస్కాన్ చేసి తొలగించిన పుర్రె భాగాన్ని 3డీ-రీకన్‌స్ట్రక్షన్‌తో దానికి సరిపడా టైటానియంతో చేయబడిన కృత్రిమ పుర్రెభాగాన్ని తయారు చేసి పేషెంట్‌కి అమర్చారు. ప్రస్తుతం ఆయనను ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి పంపారు. అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించిన హోప్ న్యూరో ఆస్పత్రి అధినేత, ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ల బృందాన్ని పేషెంట్ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



డాక్టర్ కృష్ణమూర్తి

న్యాయం చేస్తారా.. చనిపోమంటారా?

● బతికి ఉండగానే మరణించాడని భూమి పట్టా మార్పు
● పురుగులమందు డబ్బాతో బాధిత రైతు ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట పురుగుల మందు డబ్బాతో ఆందోళన చేస్తున్న ఉప్పరి పోచయ్య

వర్గల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : తాను బతికుండగానే చనిపోయినట్లు నిర్ధారించి తన భూమిని వేరొకరి పేరా పట్టా చేశారని, తనకు న్యాయం చేస్తారా.. చనిపోమంటారా.. అంటూ ఓ రైతు కుటుంబంతో కలిసి మంగళవారం వర్గల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట పురుగుల మందు డబ్బాతో ఆందోళనకు దిగాడు. వర్గల్ మండలం వేలూర్ గ్రామానికి చెందిన రైతు ఉప్పరి పోచయ్యకు వంశపారపర్యంగా వచ్చిన 36 గుంటల వ్యవసాయ భూమి ఉన్నది. గత ప్రభుత్వం 2018 సంవత్సరంలో ధరణి ద్వారా పట్టా పాస్‌బుక్ అందజేశారు. మూడు సంవత్సరాల క్రితం రైతుబంధు రాకపోవడంతో కార్యాలయానికి వెళ్లి అధికారులను ఆరా తీయగా వేరొకరి పేరా పట్టా మార్పు జరిగిందని చెబుతూ పాస్‌బుక్‌లో క్యాన్సల్డ్ స్టాంపు వేసి ఇచ్చారు. దీనిపై అధికారులను నిలదీయగా వారు రికార్డులు పరిశీలించారు. అదే గ్రామానికి చెందిన మరోవ్యక్తి ఉప్పరి పోచయ్య మరణించడంతో అతని కొడుకు రామస్వామి పౌతి కోసం దరఖాస్తు చేసుకోగా.. అధికారుల తప్పిదంతో బతికున్న ఉప్పరి పోచయ్య భూమిని మరణించిన ఉప్పరి పోచయ్య వారసుడికి పట్టా చేశారు. తిరిగి తన భూమిని తన పేరా చేయాలని బాధిత రైతు అప్పటి నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా, కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో మంగళవారం నిరసనకు దిగాడు. దీనిపై స్పందించిన తహసీల్దార్ బాల్‌రాజు మాట్లాడుతూ పొరపాటున పట్టా మార్పు జరిగినట్లు తన దృష్టికి వచ్చిందని, పూర్తి విచారణ చేసి బాధితుడికి న్యాయం చేస్తామన్నారు.

ప్రేమికుడితో పెళ్లి కావడం లేదని..

● యువతి ఆత్మహత్య

జగదేవ్‌పూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన యువకుడితో వివాహం కావడం లేదన్న కారణంతో యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన దాసరి మల్లమ్మ, కొండయ్య దంపతుల రెండో కుమార్తె అర్చన(18) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆ యువతి గతంలో గ్రామానికి చెందిన ఓ యువకుడిని ప్రేమించగా, తల్లిదండ్రులు వారి ప్రేమను అంగీకరించలేదు. మరో యువకుడితో పెళ్లి చేసేందుకు ఇటీవల నిర్ణయించారు. దీంతో మనస్తాపానికి గురైన అర్చన మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్నది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జగదేవ్‌పూర్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.

కుటుంబ కలహాలతో కానిస్టేబుల్ భార్య ..

తూప్రాన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన కానిస్టేబుల్ భార్య ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం తూప్రాన్ పట్టణానికి చెందిన గుజ్జ భూమేష్ మెదక్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. భూమేష్‌కు భార్య గుజ్జ కవిత (38)తో గతంలో గొడవలు జరగగా వేరుగా ఉంటున్నట్లు తెలిసింది. కొడుకు ఇంటర్మీడియట్ చదువుతూ హాస్టల్ ఉంటుండగా, కూతురు తల్లి కవిత వద్దనే ఉంటుంది. మంగళవారం ఉదయం కూతురును పాఠశాలలో చేర్పి ఇంటికి వచ్చిన కవిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులకు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : హత్నూర ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్టు సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి మొత్తం 172 సీట్లకు 113 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హత గల విద్యార్థులు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9963004960 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

25న ఐఐటీహెచ్‌లో 'ది పిచ్' కార్యక్రమం



కంది, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్‌లో ప్యూర్ ఈవీ స్టార్టప్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 25న ది పిచ్ పేరుతో ఓ వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా ఐదు ప్రధాన నగరాల్లో దీన్ని నిర్వహించనున్నారు. ఇందులో యువ ఆవిష్కర్తలకు నిధులను సమీకరించడానికి వీసీ సర్కిల్ సంస్థ కృషి చేస్తుంది. ప్యూర్ ఈవీ సంస్థ ఐఐటీ హైదరాబాద్‌లో అంకుర సంస్థగా మొదలై ఎలక్ట్రిక్ వాహనరంగంలో ప్రముఖ సంస్థగా ఎదిగింది. ప్యూర్ ఈవీ ఏర్పాటు, టెక్నాలజీ వ్యాపార నిర్వహణలో ఎదురైన సవాళ్లు, వాటిని అధిగమించడానికి చేసిన కృషి గురించి ఆ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ నిశాంత్ దొంగరి ప్రారంభోపన్యాసం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి సుమారు 25 స్టార్టప్ సంస్థలు, 60 మందికి పైగా ఇన్వెస్టర్లు పాల్గొంటారని నిశాంత్ దొంగరి తెలిపారు.



తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తూ..





చెరువులోకి కొట్టుకుపోయిన ధాన్యాన్ని తీసుకువస్తున్న మహిళా రైతులు

రైతు కష్టం.. చెరువు పాలు

ఆరుగాలం శ్రమించి పండించిన పంట చెరువుపాలైంది. సోమవారం ఒక్కసారిగా కురిసిన వర్షం కారణంగా సిద్దిపేట ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వద్ద ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. వరదలో ధాన్యం కొట్టుకుపోయి పక్కనే ఉన్న చింతల్ చెరువులో కలిసింది. దీంతో రైతులు ఆ ధాన్యాన్ని ఒకచోటకు చేర్చుతూ ఇన్ని రోజుల కష్టాన్ని తలుచుకుని కన్నీటి పర్యంతమయ్యారు.

-సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి)



తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న మహిళ

క్రైం కార్నర్

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి


అశోక్(ఫైల్)

మర్కుక్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతిచెందిన సంఘటన సోమవారం అంగడికిష్టాపూర్ గ్రామంలో రాత్రి 9 గంటలకు చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్కుక్ మండల కేంద్రానికి చెందిన అచ్చంగారి అశోక్(37) సోమవారం ఉదయం జగదేవ్‌పూర్ మండలం రాయవరం గ్రామానికి పని నిమిత్తం వెళ్లి తిరిగి రాత్రి 9 గంటల ప్రాంతంలో మర్కుక్ వస్తున్నాడు. అంగడికిష్టాపూర్‌లో బైక్ అదుపుతప్పి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన గ్రామస్థులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబసభ్యులు తీవ్రగాయాలతో ఉన్న అశోక్‌ను గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి తీవ్రంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మర్కుక్ పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

పిడుగు పడి ఆవు..


మృతిచెందిన పాడి ఆవు

అక్కన్నపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అక్కన్నపేట మండలంలోని రామవరం గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున ఉరుములతో కూడిన వర్షానికి పిడుగు పడి జాతరగోండ రమేష్ అనే రైతుకు చెందిన పాడి ఆవు మృచెందింది. ఆవు మృతితో రూ. లక్ష నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాని రైతు రమేష్ కోరారు.

డ్రంకన్ డ్రైవ్‌లో 9 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తన సిబ్బంది కొన్నిరోజుల నుంచి సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తాల్లో, రాజీవ్ రహదారిపై వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో మద్యం సేవించి 9 మంది పట్టుబడ్డారు. మంగళవారం వారిని సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపర్చగా, విచారణ చేసి 9 మందికి రూ.14 వేల జరిమానా విధించారు.

సిరులు కురిపిస్తున్న వంకాయ


అక్కన్నపేట మండలం ధర్మారంలో సాగు చేసిన వంకాయ తోట



- వంకాయ సాగుతో అధిక లాభాలు
- సంవత్సరంలో ఎనిమిది సార్లు దిగుబడి
- రూ.60 నుంచి రూ.70 పలుకుతున్న ధర

అక్కన్నపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కూరగాయల్లో నోరూరించే వంకాయ కూర అంటే భోజన ప్రియులు ఇష్టపడి తింటారు. ఏ శుభకార్యం జరిగినా భోజనప్రియుల్ని మనసు దోచే వంకాయ కూర తప్పనిసరిగా ఉంటుంది. ఖరీఫ్‌లో వంకాయ సాగు రైతులకు సిరులు కురిపిస్తుంది. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం ధర్మారం గ్రామంలో పలువురు రైతులు వంకాయ పంట సాగుచేస్తున్నారు. వంకాయ పంట సంవత్సరంలో ఎనిమిది నెలలపాటు దిగుబడి ఇస్తుంది. ఎకరంలో వంకాయలు కోసిన ప్రతిసారి 12 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో వంకాయ ధర రూ.60 నుంచి రూ.70 వరకు ఉన్నది. ప్రతి నాలుగు రోజులకోసారి వంకాయలు కోస్తారు. మార్కెటింగ్ సదుపాయం లేకపోవడంతో 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న సిద్దిపేట, కరీంనగర్, వరంగల్ వెళ్లి అమ్ముకుంటున్నారు. డివిజన్ కేంద్రమైన హుస్నాబాద్‌లో కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేస్తే కూరగాయల రైతులకు అందుబాటులో ఉంటుంది. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక శ్రద్ధ కనబరిచి హుస్నాబాద్‌లో కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

వంకాయ సాగుతో అధిక లాభాలు



వంకాయ సాగుతో అధిక లాభాలు వస్తున్నాయి. నేను 20 గుంటల్లో వంకాయ పంట సాగు చేశాను. విత్తనం నాటేందుకు దున్నుటకు మొత్తం పెట్టుబడి రూ.70 వేల వరకు ఖర్చు చేశాను. పంట పెట్టుబడి పోను పూర్తయ్యే సమయానికి రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఆదాయం వస్తుంది.

\- కూస రాయమల్లు, రైతు, ధర్మారం, అక్కన్నపేట మండలం

కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలి



కూరగాయలు పండించిన తర్వాత అమ్ముకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న సిద్దిపేట, కరీంనగర్, వరంగల్ మార్కెట్లకు వెళ్లి కూరగాయలు అమ్ముకోవాల్సి వస్తుంది. హుస్నాబాద్‌లో కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేసేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ చూపాలి.

\- కూస రాజిరెడ్డి, యువ రైతు, ధర్మారం, అక్కన్నపేట మండలం

బాబోయ్.. కుక్కలు!

5వ పేజీ తరువాయి..

ఏబీసీ ఆపరేషన్లు చేసేందుకు సిద్దిపేటలోని ఏబీసీ క్యాంపునకు తరలిస్తున్నారు. మున్సిపాలిటీల పరిధిలోని కుక్కలను తరలించి.. ఆపరేషన్ తర్వాత తిరిగి ఆయా ప్రాంతాల్లో వదిలేందుకు ఎనిమల్ వెల్ఫర్ సొసైటీ అనే సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. ఇందుకు ఒక్కో ఆపరేషన్‌కు రూ. 1,800 చెల్లిస్తున్నారు. అయితే, దుబ్బాక మున్సిపాటిలో పరిధిలో వందల కుక్కలు ఉండగా, ఇప్పటి వరకు 16 కుక్కలకు ఆపరేషన్లు చేశారు.

నియంత్రిస్తేనే..

కుక్కలు సాధారణంగా ఏటా రెండుసార్లు గర్భం దాల్చుతాయి. ఒక ఈతలో ఏడు నుంచి పది పిల్లలు పుట్టే అవకాశం ఉంటుంది. వాటిని అలాగే వదిలేస్తే కుక్కలు మరింత పెరిగే అవకాశం ఉంటుంది. అధికారులు స్పందించి, కుక్కల నియంత్రణను గ్రామపంచాయతీలకు వదిలేయకుండా మున్సిపాలిటీల పరిధిలో స్వచ్ఛంద సంస్థలకు అప్పగించినట్లుగా, లేదా ప్రత్యేక యంత్రాగం ద్వారా వాటికి ఏబీసీ ఆపరేషన్లు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆపద సమయంలో అండగా సీఎంఆర్ఎఫ్

- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి


బాధితుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

దౌల్తాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆపద సమయంలో నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని ఇందుప్రియల్ గ్రామానికి చెందిన తుప్పతి మంగమ్మ భర్త సత్తయ్యకు మంజూరైన రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ 20వ వార్డు కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు బండారు దేవేందర్, మాజీ ఎంపీటీసీ వీరమ్మ పాల్గొన్నారు.

పోలీస్ పహారాలో కుంట బాట తొలగింపు


సాయివెల్లి కుంట పరిధిలో ఏర్పాటు చేసిన బాటను తొలగిస్తున్న ఇరిగేషన్ అధికారులు

మద్దూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మండలం మర్మాముల గ్రామ శివారులోని సాయివెల్లి కుంట పరిధిలో ఏర్పాటుచేసిన బాటను పోలీసు పహారాలో ఇరిగేషన్ అధికారులు మంగళవారం తొలగించారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ సతీష్ మాట్లాడారు. సర్వే నెం.75లోని ఎ.9.32 గుంటల విస్తీర్ణంలో సాయివెల్లి కుంట ఉందన్నారు. దీని పరిధిలో పొలాల వద్దకు వెళ్లేందుకు బాటను ఏర్పాటు చేశారన్నారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులకు సాయివెల్లి కుంట విస్తీర్ణంపై నివేదిక అందించాలని కోరినట్లు తెలిపారు. ఈ మేరకు కుంట పరిధిలోనే బాట ఏర్పాటు చేశారని తెలియజేస్తూ రెవెన్యూ అధికారులు పంచనామా రిపోర్టును అందించారన్నారు. దీంతో ముందస్తుగా పోలీసుల పహారాలో ఎక్స్‌కవేటర్ సహాయంతో కుంట పరిధిలో ఏర్పాటుచేసిన బాటను తొలగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ విజయ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ నాగిరెడ్డి, ఇప్ప నిష్కాంత్‌రెడ్డి, పెద్దఉట్ల కర్ణాకర్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

రైతును రాజు చేసిన ఘనత కాంగ్రెస్‌దే

- జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి


చేర్యాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల, అక్టోబరు 22: వ్యవసాయాన్ని పండుగలా మార్చి రైతాంగాన్ని రాజులాచేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. చేర్యాల వ్యవసాయ మార్కెట్‌యార్డు, మండలంలోని ఆకునూరు, కాశీగుడిశెలు, కొత్త దొమ్మాట, కొమురవెల్లి మండలం రసూలాబాద్, పోసాన్‌పల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, మార్కెట్ చైర్మన్ శ్వేత, పీఏసీఎస్ చైర్మన్ మేరుగు కృష్ణ, మార్కెట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ మండలాధ్యక్షులు రవి పాల్గొన్నారు.

●చిన్నకోడూరు: మండలంలోని మల్లారం, సికింద్లాపూర్, అనంతసాగర్ గ్రామాల్లో గంగాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గంగాపూర్ పీఏసీఎస్ చైర్మన్ ముల్కల కనకరాజు ప్రారంభించి మాట్లాడారు.

●మద్దూరు: మండల పరిధిలోని రేబర్తి, గాగిళ్లాపూర్, కమలాయపల్లి గ్రామాల్లో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి ప్రారంభించారు.

●సిద్దిపేట రూరల్: సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెల్లి, బుస్సాపూర్, ఇర్కోడు, తోర్నాల గ్రామాల్లో కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అధికారులతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మురళీధర్‌శర్మ పాల్గొన్నారు.

హుస్నాబాద్ రోడ్లకు రూ.11.49 కోట్లు

హుస్నాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ నియోజకవర్గంలో పలు రోడ్ల నిర్మాణానికి రూ.11.49 కోట్లు మంజూరు చేస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కోహెడ నుంచి తంగళ్లపల్లి, కూరెల్ల వరకు రూ. 1.55 కోట్లు, కోహెడ మండలం తంగళ్లపల్లి నుంచి శ్రీరాములపల్లి వరకు రూ.1.50 కోట్లు, హుస్నాబాద్ మండలం పందిల్ల స్టేజీ నుంచి పొట్లపల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.3.95 కోట్లు, అక్కన్నపేట మండలం సంజీవయ్య కాలనీలో రోడ్డు నిర్మాణానికి రూ.1.40 కోట్లు, అక్కన్నపేట మండలం చౌటపల్లి నుంచి మల్లంపల్లి వరకు రూ.1 కోటి, అక్కన్నపేట మండలం జడ్పీ రోడ్డు నుంచి పరికిబండ వరకు రూ.60 లక్షలు, తోటపల్లి నుంచి పూసవేర్లపల్లి మధ్య వంతెన నిర్మాణానికి రూ.1.49 కోట్లు మంజూరయ్యాయని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ నిధుల మంజూరుకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కొండపోచమ్మ భూ నిర్వాసితుల పొట్టకొట్టింది మామ అల్లుళ్లే


తున్కిబొల్లారం ఆర్అండ్ఆర్‌లో కేసీఆర్, హరీశ్‌రావు చిత్రపటాలను దహనం చేస్తున్న నిర్వాసితులు

ములుగు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కొండపోచమ్మ నిర్వాసితులకు అన్నివిధాలా ఆదుకున్నామని గొప్పలు చెబుతున్న అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు బహిరంగ చర్చకు రావాలని సిద్దిపేట జిల్లా ములుగు మండలం తున్కిబొల్లారం ఆర్అండ్ఆర్ కాలనీలోని బైలంపూర్, మామిడ్యాల గ్రామస్థులు సవాల్ విసిరారు. మంగళవారం ఈ విషయమై ధర్నా నిర్వహించి, కేసీఆర్, హరీశ్‌రావుల చిత్రపటాలను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్, రాజుయాదవ్, కరుణాకర్‌తో పాటు పలువురు నిర్వాసితులు మాట్లాడుతూ కొండపోచమ్మ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో గ్రామాలు ఖాళీ చేయాలని అప్పటి ప్రభుత్వం ఆదేశాలివ్వడంతో.. తమను కేసీఆర్ ఆదుకుంటాడన్న నమ్మకంతో ఖాళీ చేశామన్నారు. ఇప్పుడు ప్రతీ ఇంటికి రూ.50 వేలు ఇస్తేనే ఖాళీ చేశారని చెప్పడం విడ్డూరంగా ఉన్నదన్నారు. ఇప్పటికైనా బహిరంగ చర్చకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. మోసపూరిత మాటలు చెప్పిన ఘనత గత ప్రభుత్వానిదేనని అన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకం


విద్యార్థులకు ఆయుధాల గురించి వివరిస్తున్న ఏసీపీ సతీష్

హుస్నాబాద్ టౌన్/దౌల్తాబాద్/తొగుట/రాయపోల్/మర్కుక్/చేర్యాల/కోహెడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని హుస్నాబాద్ ఏసీపీ సతీష్ తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పోలీసులు నిర్వహిస్తున్న విధులు, పోలీస్ స్టేషన్ నిర్వహణ, స్టేషన్ హౌస్ ఆఫీసర్ రూం, రైటర్ రూమ్, పోలీసులు ఉపయోగిస్తున్న ఆయుధాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ సతీష్, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మహేశ్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు. దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్, తొగుట పోలీస్‌స్టేషన్‌లో సీఐ లతీఫ్, ఎస్ఐ రవికాంత్‌రావు, రాయపోల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వో కృష్ణంరాజు, మద్దూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ షేక్ మహబూబ్, మర్కుక్ మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులకు గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, మర్కుక్ ఎస్ఐ దామోదర్, జగదేవ్‌పూర్ ఎస్ఐ చంద్రమోహన్, గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి, చేర్యాల పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ నీరేశ్, మద్దూరు ఎస్ఐ షేక్ మహబూబ్, కోహెడ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ వీ.అభిలాష్, గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ కే.పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ నిర్వహించారు.

రైతులకు లాభం చేకూర్చే విధంగా కలిసి పనిచేద్దాం


- ఉద్యానవన యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ దండ రాజిరెడ్డి

ములుగు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలపై రైతులు ఎక్కువ మొత్తంలో దృష్టి సారిస్తున్నారని, కలిసికట్టుగా పనిచేసి రైతులకు మేలుచేసే విధంగా కృషి చేయాలని తెలంగాణ కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవన యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ దండ రాజిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన ములుగులోని ఉద్యాన యూనివర్సిటీలో అధికారులు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యాన పంటలపై ప్రజలు ఎంతో మక్కువతో పని చేస్తున్నారని, వారికి లాభం చేకూరేలా కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

కేదారినాథ్ జగత్ గురువును కలిసిన జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్

సిద్దిపేట టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ప్రముఖ ఆధ్యాత్మిక కేదారినాథ్ జగత్ గురువు, పీఠాధిపతి భీమాశంకర్‌లింగ్ స్వామిజీని జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ కలిశారు. నాందేడ్‌లోని ఆయన మఠంలో కలిసి స్వామీజీ ఆశీర్వాదం పొందారు. రాష్ట్ర పరిస్థితులు గూర్చి, ఆధ్యాత్మికత గూర్చి ఇరువురు చర్చించారు.

స్కాలర్‌షిప్‌లు ప్రభుత్వ భిక్ష కాదు.. విద్యార్థుల హక్కు: ఏబీవీపీ


కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో ఏబీవీపీ కార్యకర్తలు

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న రూ.7,500 కోట్ల స్కాలర్‌షిప్స్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్స్ ప్రభుత్వ భిక్ష కాదు.. విద్యార్థుల హక్కు అని డిమాండ్ చేస్తూ మంగళవారం సిద్దిపేట కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద కాస్త ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. విద్యార్థి సంఘం నాయకులు లోపలికి చొచ్చుకుని పోయేందుకు ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ తెలంగాణలో పాలకులు మారినా ప్రజల, విద్యార్థుల బతుకులు మారడం లేదన్నారు. పెండింగ్ బకాయిలు విడుదల చేసి విద్యార్థులకు రావలసిన స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ వివేక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆదిత్య, పవన్ నగర కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించాలి


మాట్లాడుతున్న డీపీవో దేవకీదేవి

నంగునూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని పంపిణీ చేస్తున్న మిషన్ భగీరథ నీళ్లు అందరికీ అందేలా చూడాలని మండల ప్రత్యేక అధికారి, డీపీవో దేవకీదేవి అన్నారు. మంగళవారం నంగునూరు మండల సర్వసభ్య సమావేశం పాల్గొని మాట్లాడారు. ఆర్‌డబ్ల్యూ ఏఈ నరేష్ మాట్లాడుతూ ప్రతినెల 1, 11, 21 తేదీల్లో మాత్రమే క్లోరినేషన్ చేస్తున్నారని, ఇకనుంచి ప్రతిరోజూ క్లోరినేషన్ చేయాల్సిందేనని చెప్పారు. అనంతరం వ్యవసాయశాఖ అధికారి గీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప, ఐకేపీ ఏపీఎం మహిపాల్, ఎంపీవో సత్యనారాయణ, ఎంపీడీవో లక్ష్మప్ప, నంగునూరు సొసైటీ చైర్మన్ కోల రమేష్‌గౌడ్ తదితరులు మాట్లాడారు. తహసీల్దార్ సరిత, ఎంఈవో దేశిరెడ్డి, వైద్యాధికారి డాక్టర్ సరిత పాల్గొన్నారు.

సైక్లింగ్ పోటీల్లో రాణించిన అన్నదమ్ములు

హుస్నాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 18, 19 తేదీల్లో జరిగిన ఎనిమిదవ రాష్ట్రస్థాయి ట్రాక్ సైక్లింగ్ పోటీల్లో హుస్నాబాద్ పట్టణానికి చెందిన సూరంపల్లి సుమిత్, సూరంపల్లి అమిత్‌లనే అన్నదమ్ములు అత్యంత ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగపల్లి వెంకటనర్సయ్య తెలిపారు. హుస్నాబాద్ పట్టణానికి చెందిన సూరంపల్లి రవి కుమారులైన అమిత్ 5 కి.మీ వ్యక్తిగత విభాగంలో పాల్గొని మొదటిస్థానం సంపాదించగా.. అండర్-16 బాలుర విభాగంలో సుమిత్ రజత పతకం సాధించినట్లు చెప్పారు. విజేతలుగా నిలిచిన అన్నదమ్ములను సైక్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పీ.మల్లారెడ్డి, ఒలంపిక్ అసోసియేషన్ పరిశీలకులు, యోగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మనోహర్, స్పోర్ట్స్ అథారిటి డిప్యూటీ డైరెక్టర్ చంద్రారెడ్డి, సైక్లింగ్ కోచ్ విజయభాస్కర్‌రెడ్డిలు అభినందించారు.

వందశాతం ఇంటి, నల్లా పన్ను వసూలు చేయాలి


పన్ను చెల్లించడంతో ఇంటి యజమానికి రశీదును అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేట టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శతశాతం ఇంటి, నల్లా పన్ను వసూలు చేయాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వంగ సత్యనారాయణరెడ్డి పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్ను రూ.2,78,456లను చెల్లించడంతో ఇంటి యజమానికి రశీదు అందజేసి మాట్లాడారు. పట్టణ ప్రజలు సకాలంలో ఇంటి, నీటి పన్నులను చెల్లించి పట్టణ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్వో శ్రీకాంత్, బిల్ కలెక్టర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సమీపంలో ఓ బాలుడు ట్రాక్టర్‌తో హల్‌చల్ చేశాడు. ర్యాష్ డ్రైవింగ్‌తో స్థానికులను హడలెత్తించాడు. స్పీడ్‌గా ట్రాక్టర్ వస్తుండటంతో ఎటు వెళ్తుందోనని రైతులు గందరగోళానికి గురయ్యారు.

\- సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్

రేవంత్‌రెడ్డి భూ నిర్వాసితులకు రూ.12 లక్షలు ఇవ్వు

- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే భూనిర్వాసితులకు ఎకరాకు రూ.12 లక్షలు ఇవ్వాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భూనిర్వాసితులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు ఎకరాకు రూ.12లక్షలు ఇవ్వాలని, 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ప్యాకేజీ ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌లోని మూసీ నదిలో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, బండ్ పేరు చెప్పి పేదల ఇళ్లను హైడ్రా పేరుతో నిర్దాక్షిణ్యంగా కూలుస్తుందన్నారు. ఈ సమావేశంలో గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, గజ్వేల్ మండలాధ్యక్షుడు బండే మధు, గజ్వేల్ మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఊరిలో.. ఉండలేకపోతున్నాం..

- ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇచ్చి పునరావాసం కల్పించాలి

చిన్నకోడూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : అటు అనంతగిరి (అన్నపూర్ణ) రిజర్వాయర్ ఇటు అదనపు టీఎంసీ కాలువ నిర్మాణంతో ఊరిలో ఉండలేకపోతున్నామని చిన్నకోడూరు మండలం చెల్కలపల్లి గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇచ్చి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎల్లాయిపల్లి శివారులోని అదనపు టీఎంసీ పంప్ హౌజ్ వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ, ఇరిగేషన్ డీఈ రవీందర్ సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన విరమించాలని కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేలా చూస్తామని చెప్పడంతో ఆందోళనను విరమించారు.

'ఆంగ్ల భాషా నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి'

గజ్వేల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కాలానికి అనుగుణంగా ఆంగ్లభాషా నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలని గజ్వేల్ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ గణపతిరావు సూచించారు. గజ్వేల్ పట్టణంలోని డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం పోస్టర్ ప్రజెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యూసీ కోఆర్డినేటర్ వెంకటేశ్, అధ్యాపకులు భవాని, మహేందర్ పాల్గొన్నారు.

అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రాయపోల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాయపోల్‌లోని కేజీబీవీ పాఠశాలలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్ పోస్టును తాత్కాలిక పద్ధతిపై భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో సత్యనారాయణరెడ్డి తెలిపారు. దరఖాస్తు చేసేవారు స్థానికులై ఏడవ తరగతి చదివిన మహిళలు మాత్రమే అర్హులన్నారు. 300 మందికి వంట చేయగల సామర్థ్యం గల అనుభవం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన మహిళలు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఈ నెల 23 నుంచి 29వ తేదీలోపు దరఖాస్తుతో పాటు పాస్‌ఫొటో, ఆధార్‌కార్డ్, అనుభవం గల ధ్రువీకరణ పత్రాలు జతపరిచి స్పెషల్ ఆఫీసర్‌కు అందజేయాలని తెలిపారు. అనంతరం ఇంటర్వ్యూలతో పాటు డెమో నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

బకాయిలు చెల్లించాలి: తపస్

కొండపాక, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న ఐదు బకాయిలను వెంటనే చెల్లించాలని, పీఆర్సీని ప్రకటించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు ఊడెం రఘువర్ధన్‌రెడ్డి కోరారు. తపస్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయ ధర్మ గ్రహ దీక్షలో భాగంగా మంగళవారం మండలాధ్యక్షుడు బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కొండపాకలో జరిగిన కార్యక్రమంలో రఘువర్ధన్‌రెడ్డి, బందారంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నర్సిరెడ్డి, తిమ్మారెడిడపల్లి పాఠశాలలో నిర్వహించిన నిరసనలో మహేందర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు.

'ఆరోగ్య సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి'

అక్కన్నపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని ఎంఎల్‌హెచ్‌పీ విజయ అన్నారు. మంగళవారం అక్కన్నపేట మండలం గౌరవెల్లి ఉన్నత పాఠశాలలో పొగాకు రహిత కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గుట్కా, గంజాయి, పొగాకు, మత్తు పానీయాలకు దూరంగా ఉండే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఇందులో ప్రధానోపాధ్యాయులు జ్యోతి, పీడీ వెంకటనర్సయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ M/s శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, సిద్దిపేట బ్రాంచి వారు ఇచ్చిన [illegible]

K. SHIVA CHARAN, M.A., LL.M
Advocate & Notary
H.No. 5-2-57, Parupally Street, Siddipet.
(T.S) Cell : 98493 41518

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ M/s శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, సిద్దిపేట బ్రాంచి వారు ఇచ్చిన [illegible]

K. SHIVA CHARAN, M.A., LL.M
Advocate & Notary
H.No. 5-2-57, Parupally Street, Siddipet. (T.S) Cell : 98493 41518